





మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న పల్లా శ్రీనివాసరావు, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, రామగోపాల్‌రెడ్డి తదితరులు

చకచకా పనులు

- 25లోపు పూర్తి చేసేలా కసరత్తు
- భద్రతా ఏర్పాట్లపై కర్నూలు ఐజీ, డీఐజీల పరిశీలన
- 25న మంత్రి నారా లోకేశ్ రాక
- పనులను పర్యవేక్షించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 27, 28, 29తేదీల్లో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి వేదిక పనులు చకచకా సాగుతున్నాయి. 25వ తేదీలోపు అన్నీ పూర్తిచేసేలా చూస్తున్నారు. ప్రతినిధుల సభ వేదిక పనులు శరవేగంగా సాగుతున్నాయి. భోజనశాల, ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరం, వేదిక పక్కనే సీఎంవో క్యాంపు ఆఫీసు నిర్మిస్తున్నారు. ఇక చివరిరోజు నిర్వహించే బహిరంగసభకు సంబంధించిన వేదిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక మహానాడు ఏర్పాట్లను గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్ తదితరులు పరిశీలించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఈ నెల 27 , 28, 29 తేదీల్లో మహానాడు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననుండటంతో బహిరంగసభల వేదిక వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం పబ్బాపురంలోని వేదిక వద్ద అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభాప్రాంగణంలో పారిశుధ్యం పనులు పక్కాగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. మెడికల్ ఎమర్జెన్సీ, ఫైర్, విద్యుత్, పోలీసు, రెవెన్యూశాఖలు అన్నీ ఏర్పాటు చేయాలని సూచించారు. తొలుత కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లు మహానాడు వేదిక ప్రాంగణాన్ని, బహిరంగసభ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, డీపీవో రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో నాగరాజు, ఫైర్ ఆఫీసర్ ధర్మారావు పాల్గొన్నారు.



మహానాడు ఏర్పాట్లపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఐజీ పరిశీలన

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు రానుండడంతో మహానాడు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఐజీ (ఆపరేషన్స్) శ్రీకాంత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కడప, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, విద్యాసాగర్‌నాయుడు, అధిరాజ్‌సింగ్‌రాణా, జగదీశ్, గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా ఇతర పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రతినిధుల సభ, బహిరంగసభ వేదిక, సీఎంవో క్యాంపు ఆఫీసు, ఫుడ్‌కోర్టు, పార్కింగ్ ప్లేస్‌లు పరిశీలించారు. ఎక్కడెక్కడ భద్రత చేపట్టాలన్న దానిపై చర్చించారు. మహానాడుకు భారీ ఎత్తున జనం రానుండటంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది ఉండకూడదని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



మహానాడు వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఆపరేషన్స్ ఐజీ శ్రీకాంత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కడప, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం జిల్లాల ఎస్పీలు

ప్రజల ఆకాంక్ష మేరకే కడపలో మహానాడు

చాలా ఏళ్ల తరువాత కడప జిల్లా ప్రజలు నిన్న జరిగిన ఎన్నికల్లో ఏడు సీట్లు కట్టబెట్టి వారి ఆకాంక్షను తెలిపారు. అందుకే ఇక్కడ మహానాడు నిర్వహిస్తున్నాం. రాయలసీమ, కడప అభివృద్ధికి కృషి చేస్తాం. ఇన్ని మహానాడులు నిర్వహించాం.. ఇంత అద్భుతమైన ప్లేస్ ఎక్కడా ఇంతవరకు దొరకలేదు. 25లోపు వేదిక పూర్తవుతుంది. 25న రాత్రికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కడపకు రానున్నారు. మహానాడు ఏర్పాట్లపై ప్రతిరోజూ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు నిర్వహిస్తాం. నేతలంతా సమష్టిగా పనిచేస్తున్నారు.

- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

జయ హనుమా.. జ్ఞాన గుణసాగర

- జై హనుమాన్ నినాదాలతో హోరెత్తిన మదనపల్లె
- 1500 బైక్‌లతో వేడుకగా సాగిన శోభాయాత్ర

మదనపల్లె అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం జై హనుమాన్ నినాదాలతో హోరెత్తింది. దాదాపు 1500 బైక్‌లతో ర్యాలీగా మదనపల్లె పురవీధుల్లో జరిగిన శోభాయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హిందూ చైతన్య వేదిక, ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయం వద్ద ప్రారంభమై పట్టణంలో 8 కిలోమీటర్లు సాగిన శోభాయాత్ర విజయవంతంగా జరిగింది. హనుమంతుడి వాహనం ముందు వెళుతుండగా బైక్‌లు ర్యాలీగా సాగాయి. సుమారు 15 వందల బైకులతో నిర్వహించిన శోభాయాత్ర రాత్రి 8 గంటలకు ముగిసింది. వాహనాలు రామాలయం నుంచి బయలేదేరి ఎన్టీఆర్ సర్కిల్, కదిరి రోడ్డు, నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరి కల్యాణమండపం సర్కిల్, గొల్లపల్లె బైపాస్ రోడ్డు, రామారావు కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్, సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండ్, నెహ్రూబజార్, అప్పారావువీధి మీదుగా బెంగళూరు బస్టాండ్ చేరుకుని అక్కడ నుంచి మల్లికార్జున సర్కిల్, అనిబిసెంట్ సర్కిల్, బెంగళూరు రోడ్డు మీదుగా తిరిగి సొసైటీ కాలనీలోని రామాలయం చేరుకుంది. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మదనపల్లె మార్మోగింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. బెంగళూరు బస్టాండ్‌లోకి హనుమాన్ శోభాయాత్ర చేరుకోగానే తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు శోభాయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. శోభాయాత్రలో ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు మదనపల్లె పట్టణ తాలుకా సీఐ కళా వెంకటరమణ, రూరల్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ రామచంద్ర, వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, ట్రాఫిక్ సీఐ మోహన్, ఎస్ఐలు శివకుమార్, చంద్రశేఖర్, అన్సర్‌బాషా భారీ బందోబస్తు నిర్వహించారు. దీంతో హనుమాన్ శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో సాగింది. ర్యాలీలో హిందూ చైతన్య వేదిక సభ్యులు బండి బాలాజీ, బీజేపీ నాయకులు బండి ఆనంద్, వరదారెడ్డి నారదరెడ్డి, జర్మనీరాజు, భవానీ, బర్నేపల్లె రవికుమార్, కోసూరి భవానీ, తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో బైక్‌లలో హనుమాన్ శోభాయాత్ర, శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కేంద్రీయ విద్యాలయానికి 6.09 ఎకరాలు

- తరగతుల ప్రారంభానికి వారంలో ఆఫ్‌లైన్ నోటిఫికేషన్



వలసపల్లె పంచాయతీలో కేవీఎస్ స్థలాన్ని పరిశీలిస్తున్న కేవీఎస్ ప్రతినిధులు, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన కేంద్రీయ విద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 6.09 ఎకరాల స్థలాన్ని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ కేంద్రీయ విద్యాలయ ప్రతినిధులకు స్వాధీనం చేశారు. గురువారం మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలోని సర్వే నెంబర్లు 713, 496లో ఉన్న 6.09 ఎకరాల స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం హైదరాబాద్ కేవీఎస్ రీజినల్ కార్యాలయం నుంచి వచ్చిన డిప్యూటీ కమిషనర్ మంజునాథ, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ పరిశీలించారు. ఇదివరకే ఆ స్థలంలో ముళ్లపొదలను తొలగించి చదును చేయించిన నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయ ప్రతినిధులు స్థలం స్వాధీనానికి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా మంజునాథ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలం సంతృప్తిగా ఉందన్నారు. ఇప్పటికే మదనపల్లె పట్టణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనంలో ఈ విద్యా సంవత్సరమే కేంద్రీయ విద్యాలయం ప్రారంభించి 1 నుంచి 5వ తరగతి వరకు బోధనలు ప్రారంభిస్తామన్నారు. దీనికోసం వారం రోజుల్లో ఆఫ్‌లైన్ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ప్రతి ఏటా తరగతులు పెంచుతూ 12వ తరగతి వరకు మదనపల్లె కేంద్రీయ విద్యాలయంలో తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న స్థలంలో భవనాలు నిర్మించడానికి కేవీఎస్ ఆధ్వర్యంలో టెండర్లు పిలుస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, కేవీఎస్ తిరుపతి ఇన్‌చార్జి చంద్రశేఖర్, తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

5 వేల మందితో ఒకేచోట
యోగా నిర్వహించాలి

- 31న నాలుగు పర్యాటక ప్రాంతాల్లో... : కలెక్టర్ శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025లో భాగంగా ఈనెల 28న ఒకే ప్రాంతంలో 5 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా సాధన చేయడం వల్ల ప్రతిఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢమై ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. జూన్ 21న విశాఖపట్టణంలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొంటారని, దీనికి రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా మన జిల్లా నుంచి ఆ రోజు పది లక్షల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈనెల 28న అంగన్వాడీ హెల్పర్లు, టీచర్లు, ఆశా, హెల్త్ వర్కర్లు తదితరులు 5 వేల మందితో ఒకేచోట యోగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఈనెల 31న జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన నందలూరు సౌమ్యనాథాలయం, వెలిగల్లు ప్రాజెక్టు, గుర్రంకొండ కోట, హార్సిలీహిల్స్‌లలో కూడా యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లాలో 500 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలని, ఇందులో తడి, పొడి చెత్తలను విడిగా సేకరించాలని, ఈ దిశగా ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. జిల్లాలో అన్ని బస్టాండ్లలో మెరుగైన వసతులు కల్పించాలని చెప్పారు. బస్టాండ్లలో ప్రయాణికులకు ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని, బస్టాండు పరిసరాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ బాగుండాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇచ్చిన లక్ష్యం మేరకు తప్పనిసరిగా ప్రగతి సాధించాలన్నారు. ప్రగతి సాధనలో వెనుకబడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారం ?

బి.కొత్తకోట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టు గ్రామంలో ఓ వివాహిత తనపై అత్యాచారం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాను గురువారం గ్రామ శివారులో పశువులను మేపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనపై దౌర్జన్యం చేసి లైంగికదాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది. అయితే ఈ ఘటనకు సంబంధించి గ్రామంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిజానిజాలు పోలీసుల విచారణలో తేలనున్నాయి. కాగా ఈ విషయమై బి.కొత్తకోట పోలీసులు ఎటువంటి వివరాలు బయటపెట్టలేదు.

మూడు నెలల్లో లక్ష్యం పూర్తి చేయాలి

- డ్వామా పీడీ వెంకటరత్నం

కలికిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే మూడు నెలల్లో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యకు సంబంధించి పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ టి.వెంకటరత్నం తెలిపారు. గురువారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో నాలుగు మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ సిబ్బందితో జరిపిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారంపాండ్‌ల ఏర్పాటు లక్ష్యాలను జూన్ నెలలో పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉద్యాన పంటల కోసం లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి సకాలంలో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో కూలీలకు పని దొరకలేదనే ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందితో ఇతర సాంకేతిక ఉద్యోగులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏపీడీ శ్రీనివాసులు, కలికిరి, పీలేరు, వాల్మీకిపురం, కేవీ పల్లె మండలాల ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



సీఆర్పీఎఫ్‌లో హైడెన్సిటీ ప్లాంటేషన్‌ను ప్రారంభిస్తున్న పీడీ వెంకటరత్నం

సీఆర్పీఎఫ్‌లో హైడెన్సిటీ ప్లాంటేషన్

స్థానిక సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో అకిరా మియావాకి రకం మొక్కలతో హైడెన్సిటీ ప్లాంటేషన్‌ను డ్వామా పీడీ వెంకటరత్నం ప్రారంభించారు. 0.25 ఎకరంలో 2700 మొక్కలు నాటే విధంగా హైడెన్సిటీ మొక్కల పెంపకాన్ని చేపట్టారు. అక్కడే మరో మూడు ఎకరాల్లో 200 మొక్కలతో ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్ కోసం ఆయన పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో ఈ రెండు పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ అమర్‌నాథ్ యాదవ్, ఇన్‌స్పెక్టర్ కె.రవీంద్రరాజు, సీఆర్పీఎఫ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

- రూ. కోటి విలువ గల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, స్వాధీనం చేసుకున్న రూ.కోటి విలువ గల బంగారం, వెండి వస్తువులు

రాయచోటిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాత్రి, పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు పేరు మోసిన అంతర్ జిల్లాల దొంగల ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నిందితుల వివరాలను వెల్లడించారు. రాజంపేట పట్టణం మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చోరీ కేసుపై దర్యాప్తు ప్రారంభించిన రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే బుధవారం రాత్రి ఊటుకూరు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.కోటి విలువైన బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.లక్షా 40 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. విశాఖపట్టణం జిల్లా గాజువాక మండలం ఎర్రగడ్డ కాలనీలో నివాసం ఉంటున్న పశ్చిమగోదావరి జిల్లా కోయిలగూడెం మండలం గొరవరం పంచాయతీ లక్కవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివభవానీ, తిరుపతి జిల్లా భవానీనగర్‌లో నివాసం ఉంటున్న చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం మొరవారిపల్లె గ్రామానికి చెందిన జట్టి సుబ్రమణ్యం అలియాస్ సుబ్బు, రైల్వేకోడూరు మండలం మాధవరంపోడు గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకటేశ్ అలియాస్ వెంకీ ముగ్గురు కలిసి అన్నమయ్య జిల్లాతో పాటు తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని బొమ్మూరు, నక్కలపల్లి, తిరుచానూరు, పీలేరు, రాయచోటి, రాజంపేట, ఓబులవారిపల్లి, మన్నూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పగలు, రాత్రి సమయాల్లో పలు చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుడు తోట శివకుమార్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. అతడు తన అనుచరులైన సుబ్రమణ్యం అలియాస్ సుబ్బయ్య, సూరేపల్లి వెంకటేశ్ అలియాస్ వెంకీలతో కలిసి పలు జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని రాత్రి, పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, మన్నూరు సీఐ ఎస్.కుళాయప్ప, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఓబులవారిపల్లె ఎస్ఐ సి.మహేశ్, సీసీఎస్ ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

54,095 లీటర్ల సారా ఊట ధ్వంసం

● 191 కేసుల నమోదు, 151 మంది అరెస్ట్

● 501 మంది బైండోవర్





పీలేరు మండలం ఆవులయ్యగారిపల్లె వద్ద సారా ఊట ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటోలు)

- ఒకరిపై రెండు కేసులకు మించితే పీడీ యాక్ట్
- లక్కిరెడ్డిపల్లె, రాజంపేటలో సారా కేసులు నిల్
- జూలై 31 నాటికి సారా రహిత జిల్లాగా అన్నమయ్య
- నవోదయంలో 325 మందికి స్వయం ఉపాధి కోసం ప్రతిపాదనలు
- ఆంధ్రజ్యోతితో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్

పీలేరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటు సారా తయారు చేస్తున్న పలు అటవీ ప్రాంతాలలో మెరుపు దాడులు నిర్వహించి 54,095 లీటర్ల సారా ఊట ధ్వంసం చేశామని అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ తెలిపారు. గురువారం ఆయన పీలేరులో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి నవోదయం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ప్రారంభించామని చెప్పారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ వారిలో పరివర్తన తీసుకురావడం కోసం ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించి ఫిబ్రవరి 19 నుంచి ఇప్పటి వరకూ పలు కేసులు నమోదు చేసి అనేక మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. జూలై 31వ తేదీ నాటికి సారా రహిత జిల్లాగా అన్నమయ్యను ప్రకటించడం కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో పోలీస్, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సిబ్బందితో ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉన్నతమైన లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

పరివర్తన కోసం..

నాటుసారా కాచడం, విక్రయించడమే జీవనాధారంగా ఉన్న వారిలో పరివర్తన తీసుకు రావడం కోసం నవోదయం కార్యక్రమంలో భాగంగా 30 శాతం సబ్సిడీతో బ్యాంక్ రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ జిల్లాలో 325 మంది జాబితాతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆవులు, కుట్టుమిషన్లు, కిరాణా షాపు తదితర స్వయం ఉపాధి కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. నవోదయం కార్యక్రమం ఫిబ్రవరి 19వ తేదీన ప్రారంభించి మొదటి 40 రోజులు నాటు సారా కాచడం, విక్రయించడం వల్ల పేదల జీవితాలు ఎలా దుర్భరమౌతున్నాయో వివరించామని తెలిపారు. సారాకు బానిసలు కావడంతో రోగాల బారిన పడి జీవితాలను చేజేతులారా నశనం చేసుకుంటున్నారని ప్రజలకు వివరించామని అన్నారు.

జిల్లాలో నాటుసారా ప్రభావిత గ్రామాలు

పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారా ప్రభావిత గ్రామాలు రామానాయక్ తండా, మర్రిమాకులపల్లె, అవులయ్యగారిపల్లె తండాలు, జిళ్లేళ్ల మంద, బురుజుకాడపల్లె, వగళ్ల, ఎనుగొండపాళ్యం, దిగువతండాలు ఉన్నాయి. మదనపల్లె పరిధిలో నారమాకులతండ, కోటవారిపల్లె, తుమ్మలతండ. ములకలచెరువులో కోటకొండ, రామానాయక్ తండాలు ఉన్నాయి. వాల్మీకిపురం పరిధిలో దిగువ, ఎగువమేకలవారిపల్లె, షికారు పాళ్యం.. రాయచోటిలో శెట్టిపల్లె, పెద్దబిడికి, పరికలబండ.. రైల్వేకోడూరు పరిధిలో వైకోట, బోడుగుట్టపల్లెలను అత్యంత సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు.

కేసుల వివరాలు..

పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 66 కేసులు నమోదు చేసి 40 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే వారి వద్ద 157 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 15,270 లీటర్ల ఊట ధ్వంసం చేసి 315 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెలో 39 సారా కేసులలో 48 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద 592 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2,920 లీటర్ల ఊట ధ్వంసం చేసి రెండు వాహనాలను సీజ్ చేశారు. ములకలచెరువులో 37 కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 96 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 4075 లీటర్ల ఊట ధ్వంసం చేశారు. వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో 31 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 92 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 13,600 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి 100 కిలోల బల్లం స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరులో 12 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేసి 48 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 17,060 లీటర్ల ఊట ధ్వంసం చేసి 26 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. రాయచోటిలో 6 కేసులు నమోదు చేసి 10 మందిని అదుపులోకి తీసుకొని 86 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1170 లీటర్ల ఊట ధ్వంసం చేసి రెండు వాహనాలు సీజ్ చేశారు.

రెండు కేసులుంటే పీడీ యాక్ట్..

నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఈ హెచ్చరించారు. ఒకే వ్యక్తిపై రెండు కేసులు నమోదైతే అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. అలాగే సారా తయారు చేసేవారికి నల్లబెల్లం సరఫరా చేసినా తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. నిందితులు ఎవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించేది ఉండదని హెచ్చరించారు.

రూ.1.57 లక్షల జరిమానా



జిల్లా వ్యాప్తంగా పలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకూ 501 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. వీరిలో మళ్లీ సారా విక్రయాలకు పాల్పడిన 18 మందిపై కేసు నమోదు చేసి రూ.1.57 లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ చెప్పారు. కాగా.. అన్నమయ్య జిల్లా పరిధిలో లక్కిరెడ్డిపల్లె, రాజంపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో సారా కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

నేడు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం

హాజరుకానున్న రాయలసీమ జిల్లాల ఉద్యాన శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరాజులు

రైల్వేకోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు ఉద్యాన విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు తెలిపారు. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో జరగబోవు కార్యక్రమాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో సాగులో ఉన్న వివిధ రకాల ఉద్యాన పంటలు, వాటి సాగు స్థితిగతులు, పరిష్కార మార్గాల దిశగా తీసుకోవాల్సిన చర్యలు, నూతన పరిశోధనలకు అవకాశం తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ పరిశోధన, విస్తరణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాల తర్వాత ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించనున్న ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశాలకు రాయలసీమ జిల్లాల నుంచి ఉద్యానశాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉద్యాన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల ప్రగతి నివేదికపై చర్చిస్తారన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరౌతున్నట్లు ఆయన వివరించారు. రైతులు పండించిన పండ్ల రకాలను ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ కేటీ వెంకటరమణ, డాక్టర్ సి.మధుమతి, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల డీన్ పీటీ శ్రీనివాసులు, ఉద్యాన కళాశాలకు చెందిన సదరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

సుండుపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా తిరునాళ్లు, జాతరలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లింల మత పెద్దలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు తిరునాళ్లు, జాతరలు, పండుగలు ఉన్నాయని, ఎక్కడా కూడా వాటికి భంగం కలగకుండా నిర్వహించుకోవాలని కోరారు. చాందినీబండ్ల దగ్గర అసాంఘీక కార్యలాపాలు నిర్వహించేలా ప్రోత్సహించడం, మద్యం తాగి మత్తులో గలాటాలు సృష్టించడం వంటివి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపైన జాతర సమయంలో బండ్ల వద్ద రెచ్చగొట్టేలా మాట్లాడడం, విమర్శలు చేయడం వంటివి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి చాందినీబండి వద్ద ఇద్దరు పోలీసు సిబ్బంది ఉంటారని మసీదుల దగ్గర అల్లరి మూకలు అల్లర్లు చేయాలనుకుంటే తాట తీస్తామన్నారు. తిరునాళ్లు, జాతరలకు చాందినీబండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు, మత పెద్దలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరానికి పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారులు

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ శివారులోని వడ్డిపల్లె వద్ద కుక్కల దాడిలో జింక మృతి చెందింది. గురువారం వేకువజామున వడ్డిపల్లె సమీపంలోని మాదినకొండ అటవీ ప్రాంతం నుంచి ఓ జింక పిల్ల అడవి దాటి జనావాసాల్లోకి వచ్చింది. ఇది గమనించిన వీధి కుక్కలు జింకను తరమడంతో పాటు దాడి చేసి చంపేశాయి. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్ఓ జయప్రసాదరావు ఆదేశాలతో డీఆర్‌వో మదనమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని మదనపల్లె పశువుల ఆస్పత్రికి తరలించారు. అక్కడ పశువైద్యశాఖ ఏడీ రోహిణి ఆధ్వర్యంలో జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం జింక కళేబరాన్ని సమీప అడవిలో పూడ్చి పెట్టారు.

వివాదాస్పద నిర్మాణాలపై సబ్‌కలెక్టర్ విచారణ

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ రెవిన్యూ భవన్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న పునాదులపై సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ విచారణకు ఆదేశించారు. గురువారం కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన సబ్‌కలెక్టర్ ఆ స్థలం వెనక నిర్మిస్తున్న పునాదులపై ఆరా తీశారు. ఆ స్థలం ప్రభుత్వ స్థలమా, అందులో ఎవరికైనా లబ్ధిదారులకు కేటాయించారా అని తహసీల్దార్ ధనంజయులును ప్రశ్నించారు. దీనిపై పూర్తిగా విచారించి తనకు నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బీఎంపీ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో రామ్లానాయక్ కుమారుడు ఎం.కృష్ణానాయక్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా బీఎంపీపీ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 130 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

మదనపల్లె విద్యార్థినికి రాష్ట్ర స్థాయి బయోడైవర్శిటీ అవార్డు



డిప్యూటీ సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న గుణవిజయ

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయో డైవర్శిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో మదనపల్లెకు చెందిన డిగ్రీ విద్యార్థిని గుణవిజయ ప్రథమ అవార్డు అందుకున్నారు. గురువారం విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వారం రోజుల క్రితం ఎస్వీ యూనివర్సిటీ బయో డైవర్శిటీ గురించి నిర్వహించిన పోటీల్లో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థిని గుణవిజయ పాల్గొని వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ బయోడైవర్శిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.విజయకుమార్, ఐఎఫ్ఎస్ అధికారుల సమక్షంలో ప్రథమ బహుమతి అందుకున్నారు. డిప్యూటీ సీఎం చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్నారు. కాగా ఆ విద్యార్థినిని కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, బయోటెక్నాలజి హెచ్‌వోడీ డాక్టర్ రమ్య అభినందించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన అవసరం

ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా అధికారి వెంకటమోహన్



నవధాన్యాల సాగుపై రైతులకు వివరిస్తున్న వెంకటమోహన్

రాయచోటిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల (పీఎండీస్) సాగుపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా అధికారి వెంకటమోహన్ తెలిపారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు యూనిట్‌లోని ఏపిలవంకపల్లిలో శంకరమ్మ పొలంలో నవధాన్యాల సాగు ఏ విధంగా చేపట్టాలి. ఎకరాకు ఎన్ని కిలోల విత్తనాలు వేయాలి, ఘనజీవామృతం ఎకరాకు ఎంత వేయాలి అనే అంశాలపైన రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాగు డివిజన్ ఇన్‌చార్జి రమణనాయక్, మండల ఇన్‌చార్జి వంశీ, యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల దొంగతనం కేసులో జైలుశిక్ష

ఓబులవారిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుల్లో నిందితులకు కోర్టు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీ కొర్లకుంట క్రాస్‌రోడ్డు వద్ద అయ్యప్పరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లావనూరు దామోదర్ మోటారు సైకిల్‌ను సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం గ్రామానికి చెందిన పఠాన్‌సాహెబ్ దొంగలించాడు. విచారించి మోటారు సైకిల్‌ను రికవరీ చేసి నిందితుడిని రైల్వేకోడూరు కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ తేజసాయి 2 నెలల జైలుశిక్ష విధించారు. అలాగే మంగంపేట అగ్రహారంలో పసుపులేటి బాలాజి ఇంటి వద్ద ఉంచిన ఆటోను 2025 జనవరి 25వ తేదీ రాత్రి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన వడ్ల శివశంకరాచారి చోరీ చేశాడు. ఈ కేసులో కూడా మేజిస్ట్రేట్ నిందితుడికి ఒకటిన్నర నెల సాధారణ జైలుశిక్ష విధించారు.

టీడీపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం

● టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వైసీపీ భరతం పడతాం : చమర్తి ● జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలోనే పనిచేయండి : దుర్గాప్రసాద్







ఎడ్లబండిపై ర్యాలీగా వస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, దుర్గాప్రసాద్, జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దుర్గాప్రసాద్‌లు పిలుపునిచ్చారు. గురువారం రాజంపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు అనవసరంగా టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు కడపలో జరిగే మహానాడు కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ సత్తా చాటుదామని చెప్పారు. పార్టీ నియోజకవర్గ కార్యకర్తలకు ఎళ్లవేళలా తాను అందుబాటులో ఉంటానని చమర్తి వెల్లడించారు. అందరూ వ్యక్తిగత విభేదాలు మాని నియోజకవర్గంలో టీడీపీ పూర్వ వైభవానికి, పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాజంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి వచ్చే స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేటలో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

పార్టీ పరిశీలకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎవరూ వ్యక్తిగత అజెండాలకు పోకుండా కార్యకర్తలకు ఏ పని కావాలన్నా, పార్టీ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలోనే చేసుకోవాలన్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మాజీ మండలాధ్యక్షులు పొరా సుబ్బానాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, జిల్లా తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు శరత్‌కుమార్‌రాజు తదితర మండల నాయకులు, సీనియర్ టీడీపీ నాయకులు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గం నుంచి 30 వేల మంది కార్యకర్తలను తీసుకెళ్లదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎద్దుల బండ్లపై నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు భారీ ఎత్తున భోజనం ఏర్పాటు చేశారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

● రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రిన్స్ టెస్ట్-2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకు ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి.మోక్షిత్ 400 మార్కులకు గాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడన్నారు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. వీరితో పాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.

దేశ సమైక్యత కోసం పాటుపడాలి



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

లక్కిరెడ్డిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత కోసం అందరూ పాటుపడాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా గురువారం లక్కిరెడ్డిపల్లెలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడురోడ్ల కూడలి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్‌కు సంతాపం తెలిపి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదన్‌మోహన్, షేక్ ఆరీఫ్, రెడ్డెయ్య, డాక్టర్ షఫీనాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో చక్రేనాయక్, ఎంపీడీవో ఉషారాణి, పాల్గొన్నారు.

రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా



వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

● నిరుపయోగంగా మారిన రైతుబజార్

● ఏడాది పూర్తయినా ఉపయోగంలోకి రాని వైనం

వేంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులను స్వయంగా అమ్ముకొని లాభపడాలన్న ఉద్దేశ్యంతో రైతు బజార్ నిర్మించారు. ఏడాది క్రితం నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు. అయితే పలు రకాల కారణాలతో ఇప్పటి వరకు రైతు బజార్ ఉపయోగంలోకి రాకపోవడంతో రూ.1.20 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది.

వేంపల్లెలోని ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన రైతు బజార్‌ను నిర్మించారు. రూ.1.20 కోట్లతో నిర్మించి.. గతేడాది మే నెలలో ప్రారంభించారు. అందులో 8



రైతు బజార్‌లో ఉన్న స్టాల్స్

షాపింగ్ గదులు 44 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రైతులు తక్కువ అద్దెతో స్టాల్స్, దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తెలిపారు. అయితే పంచాయతీ పరిధిలో కడప రోడ్డులో ప్రైవేటు కూరగాయల మార్కెట్ నడుస్తోంది. ఈ కారణంగా రైతుబజార్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు, రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. వ్యవసాయశాఖ అధికారులు ఎన్నిమార్లు రైతులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి చెప్పిన రైతు బజార్‌లోకి వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. ప్రైవేటు కూరగాయల మార్కెట్ మూసేస్తే ఇక్కడకు వస్తారని చెప్పినా, వేలంలో ప్రైవేటు కూరగాయల మార్కెట్ షరతు ఉందని, ఏడాది వరకు మార్చలేమని చెప్పడంతో రైతు బజార్ నిరుపయోగంగా ఉంది. రైతు బజార్‌ను తెరిచి ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీకి... నెల అద్దెకు

రైతులు స్వయంగా రైతు బజార్‌లోకి రాలేదన్న కారణంతో వ్యవసాయశాఖ మార్కెటింగ్‌శాఖ అధికారులు పంచాయతీకి అప్పగించాలని నిర్ణయించారు. నెల అద్దె రూ.1.20 లక్షలు చెల్లించాలని, పంచాయతీ ఆధ్వర్యంలోనే రైతు బజార్‌ను నడుపు కోవాలని... ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై కలెక్టర్ డీపీఓతో చర్చించి నెల అద్దె రూ.80వేలు చెల్లించాలని కడప పంచాయతీ అధికారిణికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు కూడా ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు. వేంపల్లెలో ప్రస్తుతం ఈఓ లేని కారణంగా మార్కెట్ వేలం గడువు ముగిసినా కొత్త టెండర్ పిలువలేదు. కొత్త ఈఓ రామసుబ్బారెడ్డి జాయిన్ అయి వారం రోజులకే లీవ్‌పెట్టి వెళ్లడంతో మార్కెట్ టెండర్ వేలంకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో రైతు బజార్ సమస్యను పరిష్కరించే ఆస్కారం లేకుండా పోయింది. ఇటు రైతు బజార్ తెరవాలంటే కొత్త వేలం టెండర్‌లో అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పంచాయతీ ఈఓ వచ్చిన తర్వాత రైతు బజార్ భవితవ్యం తేలే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

రైతు బజార్‌ను తెరిచి రైతులకు ఉపయోగపడేలా సహకరించాలని స్థానిక పంచాయతీ అధికారులను కోరుతూనే ఉన్నాం. ఇప్పటికి పలుమార్లు లేఖ రాశాం. నెల అద్దె రూ.80వేలను నిర్ణయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ జీఓను పంచాయతీ అధికారులకు అందించాం. స్థానిక పంచాయతీ పాలకమండలి ఈఓ చర్చించి రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని కోరుతున్నాం.

-రుచిత, రైతు బజార్ అధికారిణి, వేంపల్లె



జిల్లేళ్ల వద్ద రాళ్లు విరిగిపడి పాడైన తూము

కేసీ తూములు ఇలా...

● పాడైన షట్టర్లు... గేర్‌బాక్స్‌లు ● ఆందోళనలో రైతులు

● మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

దువ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతన్నలకు జీవనాధారం కేసీ కాలువ. కేసీ కెనాల్ కింద జిల్లా పరిధిలో 82,937 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతియేటా సకాలంలో వర్షాలు పడితే కేసీ కెనాల్‌కు నీటి సరఫరా జరిగి పంటలు సస్యశ్యామలంగా పండుతాయి. శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా ప్రతి యేటా కేసీ కాలువకు నీరు అందుతుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో పొలాలను తడిపే కేసీ తూముల షెట్టర్లు పాడైపోయాయి. కేసీ కాలువకు నీటి ప్రవాహం ఉన్న సమయంలో పాడైన షట్టర్లు, గేర్‌బాక్స్‌లు మొరయిస్తున్న కారణంగా నీరు వృథా అవుతోంది. వీటి మరమ్మతులపై నీటిపారుదల శాఖ దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మైదుకూరు నియోజకవర్గం పరిధిలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట మండలాల పరిధిలో కేసీ కాలువ కింద 55,872 ఎకరాల ఆయకట్టు ఉంది. వరి, పసుపు, వేరుశనగ, జొన్న తదితర పంటల సాగుపై రైతులు ఆసక్తి కనపరుస్తారు. ఈ నేపథ్యంలో కాలువ పరిధిలో తూముల నిర్వహణ సరిగా లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవతున్నారు. దువ్వూరు మండల పరిధిలో మొత్తం 15 తూములు ఉన్నాయి. వాటికున్న షట్టర్లు, సామాగ్రి రాంసాయినగర్, జిల్లేళ్ల, ఏకోపల్లి, భీమునిపాడు, అన్నపుశాస్త్రులపల్లి పరిధిలో పాడైనట్లు రైతులు వాపోతున్నారు. వీటితోపాటు తూముల్లోని గేరుబాక్సులు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ప్రతియేటా సకాలంలో వర్షాలు పడితే ఆగస్టులో నీటి సరఫరా జరుగుతోంది. వీటి మరమ్మతుల పనులు చేపడితే నీటి వృథాకు ఆస్కారం లేకుండా రైతులు సద్వినియోగం చేసుకుంటారు.

జిల్లాలో మైదుకూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు రాజుపాళెం, ప్రొద్దుటూరు, చెన్నూరు, వల్లూరు, చింతకొమ్మదిన్నె, కడప మండలాల పరిధిలోని కేసీ తూముల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని ఆయా ప్రాంతాల రైతాంగం కోరుతోంది. ఏడాది కిందట రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇరిగేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.350 కోట్లు కేటాయించినట్లు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. ఈ నిధులు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తే తాగు, సాగునీటికి తాత్కాలిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చునని భావిస్తున్నారు. ఏది ఏమైనా తూముల బాగోగులపై శ్రద్ధ వహిస్తే రైతుల పొలాలకు నీరు అంది పంటలు పండే అవకాశం ఉంది. ఈ విషయంపై దువ్వూరు సెక్షన్ కేసీ కాలువ ఏఈఈ పవన్‌కుమార్ వివరణ ఇస్తూ... తూముల మరమ్మతులపై దృష్టి సారించినట్లు తెలిపారు. దెబ్బతిన్న వాటి పనుల కోసం ఇంతకుమునుపే టెండర్లు జరిగాయని, వాటి పనులు త్వరలో చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



షట్టర్‌లేని రాంసాయినగర్‌వైపు పొలాల తూము, తుప్పుపట్టిన ఏకోపల్లె తూము షట్టర్

ఘనంగా ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

చక్రాయపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. గురువారం ఉదయం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, హోమగుండ ప్రోక్షణ అనంతరం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు ధర్మగిరి వేద పాఠశాల అధ్యాపకులు శ్రీమన్ రామానుజార్యులు బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో గండిక్షేత్రం కిటకిటలాడింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3వరకు క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 5వేల మంది భక్తులకు ఎర్రగుంట్లకు చెందిన ఓబుల్‌రెడ్డి, రమాదేవి దంపతలు, అప్పకుండు వెంకట సుబ్బారెడ్డి, సునీత దంపతులు అన్నదానం చేశారు. కాగా, స్వామివారి నిత్యా న్నదాన పథకానికి గండి క్షేత్రానికి చెందిన ఎద్దుల రాజశేఖర్, పార్వతి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. బద్వేలుకు చెందిన పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, ఆదిలక్ష్మి రూ.51వేలు, వేంపల్లెకు చెందిన గురుమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య మునెమ్మ రూ.25,116 విరాళంగా ఇచ్చారు. కాగా, ఉత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన మహిళలు కోలాటాలు ఆకట్టుకున్నాయి. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, అర్చకులు గోపాలస్వామి, రామమోహన్‌శర్మ, దేవస్థాన చైర్మన్ కృష్ణ తేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



మహాపూర్ణాహుతిలో భాగంగా అగ్నికి ఆహుతి ఇస్తున్న ద్రవ్యాలు

వెల్లాలో వైభవంగా....

రాజుపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సంజీవరాయస్వామికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ఆకుపూజలు, వడమాల తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఒంటె వాహనంపై సంజీవరాయస్వామి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒంటెవాహనంలో ఊరేగుతున్న సంజీవరాయస్వామి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన కుమార్

చాపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లె కుమార్ (38) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొత్తరాజువారిపేట గ్రామానికి చెందిన కుమార్ ప్రొద్దుటూరు నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అతని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మినీ లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

● ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రాజేశ్, రాహుల్

చెన్నూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూరుకు చెందిన రాజేశ్ (17), రాహుల్ (17) ద్విచక్ర వాహనంపై కడపకు వెళుతుండగా వారి ముందు వెళుతున్న మినీ లారీ ఎదురుగా గేదె అడ్డం రావడంతో బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పి వెనక వైపు మినీ లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో రాహుల్ తలకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. రాజేశ్ కూడా గాయపడ్డాడు. ఇరువురిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం... కేసు

వేముల, మే 22 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలికపై 17ఏళ్ల బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలో ఓ బాలిక (మూగ,చెవిటి) ఇంట్లో ఉండగా ఓ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి గమనించి గట్టిగా అరవడంతో నిందితుడు అక్కడ నుంచి పారిపోయాడు. తర్వాత జరిగిన విషయాన్ని ఆమె భర్తకు ఫోన్ ద్వారా తెలియజేయగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు వితరణ



వెండి ఆభరణాలను సమర్పిస్తున్న టీడీపీ నాయకులు, అలంకరించిన వెండి ఆభరణాలతో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం ఆంజనేయస్వామికి రెండు కిలోల వెండి కవచం, పాదాలు, కిరీటం వితరణగా ఇచ్చారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎన్నికల్లో గెలిస్తే ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు చేయిస్తానని ఆయన మొక్కుకున్నారు. తన కోర్కె నెరవేరడంతో హనుమాన్ జయంతి సందర్భంగా వెండి ఆభరణాలను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య చేతుల మీదుగా ఆలయపూజారికి అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి ఆంజనేయస్వామికి నూతన ఆభరణాలను అలంకరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, కేసీకెనాల్ వైస్‌చైర్మన్ లక్ష్మీపేట గురివిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటికో పారిశ్రామికవేత్త.. ప్రభుత్వ లక్ష్యం



ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సీకేదిన్నె, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నెలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహించే ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశారన్నారు. అదే స్ఫూర్తితో మహిళలు ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రతి ఇంటి నుంచా పారిశ్రామికవేత్త తయారు కావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో కమలాపురంతో పాటు చింతకొమ్మదిన్నెలో ఉచిత కుట్టుమిషన్ల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సృజల స్రవంతి మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, పీరూప్రసాద్, రాజారావు, నజీర్, శంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, గోవిందు, వెంకటసుబ్బయ్య అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు మట్కా బీటర్లు అరెస్టు



మట్కా బీటర్లను చూపుతున్న ఎస్ఐ హనుమంతు

ప్రొద్దుటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం సాయికుటీర్ రోడ్డులోని విహంగ అపార్ట్‌మెంట్ ఎదురుగా మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను గురువారం మధ్యాహ్నం త్రీటౌన్ ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.95 వేల నగదుతో పాటు మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన జి.విశ్వనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన జె.నరసింహులు, ప్రొద్దుటూరు టౌన్ దేవాంగపేటకు చెందిన జి.వీరయ్యలు వున్నారు.

పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో డీఎఫ్‌వో వినీత్‌కుమార్, అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కడప ఫారెస్టురేంజ్ పరిధిలోని మద్దిమడుగు ఈస్ట్ బీట్‌లో పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీ అధికారి వినీత్‌కు మార్ తెలిపారు. కడప అటవీ క్షేత్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం తెల్లవారుజామున 3గంటల గంటల సమయంలో కొంత మంది వ్యక్తులు అడవిలోకి వెళ్లినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో కడప రేంజ్ కార్యాలయ పరిధిలోని సిబ్బంది మద్దిమడుగు ఈస్ట్‌బీట్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టగా 6.30 గంటలకు చల్లపల్లి బావి వద్ద పది మంది తమిళ కూలీలు కనిపించారన్నారు. అటవీ సిబ్బం దిని చూసి దుంగలను అక్కడే వదిలేసి పారిపోతుండగా తమిళనాడు ధర్మపురి జిల్లాకు చెందిన రమణ ఆడియన్ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. మిగిలిన 9 మంది పారిపోయారని.. వారి కోసం గాలింపు చేపట్టామన్నారు. కూలీలు వదిలి వెళ్లిన దుంగలను స్వాధీనం చేసుకున్నామని.. వాటి బరువు 490 కేజీలు ఉంటుందన్నారు. ఈ వ్యవహారంలో స్థానికుల ప్రమేయం ఏదైనా ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సమా వేశంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసరు ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం



హనుమజ్జయంతి సందర్భంగా గురువారం రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో అంజన్నకు వైభవంగా పూజలు నిర్వహించారు. 'శ్రీఆంజనేయం..ప్రసన్నాంజనేయం' అంటూ భక్తులు అంజన్న నామం జపించారు. ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


- ఆంధ్రజ్యోతి బృందం





రాయచోటిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు... రాజంపేట: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి.. నందలూరు, పుల్లంపేటలో..








రైల్వేకోడూరు, చిట్వేలి, ఒంటిమిట్ట, టి.సుండుపల్లి, సిద్దవటం, రాయచోటిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

పన్నులు సకాలంలో చెల్లించాలి : కమిషనర్



మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాజంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో సకాలంలో పన్నులు చెల్లించాలని పురపాలక కమిషనర్ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులకు కమిషనర్ జి.శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలకలో కుళాయి, ఇంటి పన్నులను సకాలంలో చెల్లించేందుకు ప్రజలకు సెక్రటరీలు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సచివాలయంలో ఉండే సమస్యలను గుర్తించి తక్షణమే సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. మున్సిపాలిటి పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలన్నదే మన లక్ష్యమని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పలు ప్రయోజనాలు



ఆదర్శ రైతులను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చిన్నమండెం, మే22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పలు ప్రయోజనాలు ఉన్నాయిని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. గురువారం చిన్నమండెం మండలంలోని గంగిరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన గ్రామసభలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏపీసీఎన్ఎఫ్ ఆదర్శ రైతుల విజయగాథలను రైతులకు వివరించారు. ఆదర్శ రైతులు వెంకటలక్ష్మమ్మ, అంజనమ్మలను సన్మానించారు. పీఎండీఎస్ వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలు, మోడల్స్ గురించి, కిచెన్ గార్డెన్ ఉపయోగాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చలపతినాయుడు, అరుణకుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే ఇన్‌చార్జి తన్మయి, ఐసీఆర్‌పీలు రామాంజులు, కిరణ్, రఘు, వెంకట్రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

సుండుపల్లె, మే22(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సహాయకుల కు అందజేయాలని సుండుపల్లె మండల స్పెషల్ ఆఫీసర్ సురేశ్ తెలిపారు. గురువారం సుండుపల్లె, భాగంపల్లి, మడితాడు, పెద్దినేనికాలువ, ఈడిగపల్లి గ్రా మాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యంపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. తడి పొడి చెత్తను వేరుచేసి తరలించడం వలన సంపద తయారీకి వీలుగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ఇండ్ల మధ్య చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. నీటి కుంటలు ఏర్పడితే వాటి వలన దోమలు తయారయ్యే వాధ్యలు సంక్రమించే అవకాశాలు ఉన్నాయని ప్రజలకు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనాధ్‌రెడ్డి, ఆనంద్, రాంమోహన్, వంశీ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన శ్రీవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా మాధవరం గ్రామ వాస్తవ్యులు రాజు ప్రభాకర్ రెడ్డి, రెడ్డెమ్మ దంపతులు రూ. 2,05,121 ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందచేశారు. వీరికి ఆలయ అధికారులు వేద పండితులతో వేదాశీర్వచనం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రారంభమైన మహాభారత యజ్ఞం



మహాభారతంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

చిన్నమండెం, మే22(ఆంధ్రజ్యోతి): మల్లూరులో 12వ పంచమ వేద మహాభారత యజ్ఞం గురువారం ప్రారంభమైంది. మల్లూరులో 12 సంవత్సరాలుగా మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భాగవతారిణి ఎన్‌కే సీతాలక్ష్మి మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 వరకు 15 రోజులు హరికథ గానం, రాత్రి సమయంలో మహాభారత నాటకం కథలు చెబుతారని నిర్వాహకులు తెలిపారు.

'పసుపుదళంతో వైసీపీకి వణుకు'



రాజంపేట మినీ మహానాడుకు తరలివెళ్లిన సిద్దవటం టీడీపీ నేతలు

సిద్దవటం, మే 22 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసి మద్యం అధిక రేట్లకు అమ్మి కోట్లాది రూపాయలు స్కాం చేసిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీలోని అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తుంటే వారిలో వణుకు మొదలైందని టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతిమోహన్‌రెడ్డి అన్నారు. రాజంపేట ఏబీ చంద్రారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మినీ మహానాడు కార్యక్రమానికి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. పసుపుదళం చూసి వైసీపీకి వణుకు పుట్టిందని, తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దారపునేని దశరథనాయుడు, రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, మాజీ మార్కెట్ ఛైర్మన్ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : సీఐటీయూ



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు పెండింగ్ ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పురపాలక కార్యాలయం వద్ద వేతనాలు పలు సమస్యలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పురపాలక పరిధిలో 15 మంది బదిలీ కార్మికులకు మూడు మాసాల నుంచి వేతనాలు ఇవ్వలేదని, పలుమార్లు అధికారులు కలిసి విన్నవించుకున్నా బిల్లులు పెట్టాము రావడంలేదని చెప్పడం తప్ప సమస్య పరిష్కరించిన దాఖలాలు లేవని అన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని విరమణ పొందిన కార్మికులకు ప్రతినెల 5 వేలు పింఛను మంజూరు చేయాలని, సబ్బులు, నూనె వంటి నిత్యావసర సరకులు అందజేయాలని కోరారు. కార్మికులకు ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యానికి 70 వేల వరకు ఖర్చు చేసే వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, ప్రసాద్, బుజ్జమ్మ, గంగయ్య, సురేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం, మే 22 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాదుల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. మండలంలోని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తల వహించాలని, వర్షాలు కారణంగా పరిసర గృహ ప్రాంతాల్లో వర్షపునీరు, మురికి నీరు నిల్వ ఉన్నచో లార్వా ఉత్పత్తి చెంది సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, లార్వా ఉత్పత్తి చెందకుండా నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి పూర్తిగా నీటిని తొలగించాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అపరిశుభ్రతను పూర్తిగా తొలగింపు చర్యలు చేపట్టాలని డాక్టర్ తెలిపారు.

కస్తూర్బా కళాశాల ఏర్పాటుకు భూమి పూజ

చిట్వేలి, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సి.కందులవారిపల్లె పంచాయతిలో 1.20 కోట్లతో నిర్మించనున్న కస్తూర్బా జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిలు గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గ మహిళా వైసీపీ అధ్యక్షురాలిగా లక్ష్మీనారాయణమ్మ



రైల్వేకోడూరు, మే 22(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గ మహిళా వైసీపీ అధ్యక్షురాలిగా ఇసుకపాటి లక్ష్మీనారాయణమ్మను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు అండగా ఉంటామని తెలిపారు. వైఎస్ జగన్, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న పంతగాని నరసింహప్రసాద్, భక్తులు

రైల్వేకోడూరు, మే 22:(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని అంబేడ్కర్‌నగర్ లో గురువారం వైభవంగా గంగమ్మ జాతర నిర్వహించారు. తెల్లవారుజామున గంగమ్మతల్లిని ఊరేగించారు. ప్రజలు మొక్కుబడులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లిని మట్టితో తయారు చేసి అలంకరించారు. జాతర సందర్భంగా చుట్టుపక్కన గ్రామాల ప్రజలు తరళి వచ్చారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ తదితరులు గంగమ్మతల్లికి పూజలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఉపాధి కూలీలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మే22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి బాధితుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

మహాభారతం నిర్వహణకు మంత్రి రూ.1,16,000 విరాళం

చిన్నమండెం మండలంలో నిర్వహించే మహాభారతం సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నిర్వాహకులకు రూ.ఒక లక్షా 16 వేల విరాళం ఇస్తానన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా దేవగుడిపల్లి కొండమూల ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి, వండాడి ఆంజనేయస్వామి ఆలయాల్లో మంత్రి కుటుంబ సమేతంగా పూజలు చేశారు. అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధి హామీ పథకం కూలీలతో మంత్రి

వండాడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం కూలీలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిల్లులు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

లక్కిరెడ్డిపల్లె, మే22(ఆంధ్రజ్యోతి): రైతులకు రుణాలు సకాలంలో మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడు వడ్లమూడి హరినాథనాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను కలిసి విన్నవించారు. మండల వ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు అనేక ఆర్థిక ఇబ్బందులతో వేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందిపడుతున్నారని, రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు.

భోజన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి



భోజన వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం, మే22(ఆంధ్రజ్యోతి):మహానాడు కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసే భోజనం వసతి పక్కాగా ఉండాలని రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి గువ్వలచెరువు సమీపంలో భోజన వసతి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో



ఒంటిమిట్ట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంటపంపల్లె పంచాయతి మారయ్యగారిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో గౌస్‌బాషా పరిశీలించారు. గురువారం మారయ్యగారిపల్లెలో జరుగుతున్న కాలువ పనులను తనిఖీ చేసి సిబ్బందికి, కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. ఉపాది కూలీలకు మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని అధికారులకు తెలియజేశారు. ప్రస్తుతం రోజుకు 270 రూపాయలు వస్తుందని కూలీలు తెలిపారు. ఆదాయం మరింత పెరిగేలా పనులు చేయాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాన్ కృపాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మండల ప్రత్యేక అధికారి సమీక్ష



మాట్లాడుతున్న సహదేవరెడ్డి

ఓబులవారిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల అధికారులతో ప్రత్యేక అధికారి సహదేవరెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. అనంతరం గృహ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి వాటి నిర్వహణ తీరును తెలుసుకున్నారు. ఈ కర్యక్రమంలో ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, విద్యాశాఖాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కిట్‌లు పంపిణీ

ఓబులవారిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కటికవారింపల్లె గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్‌లను గురువారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పంపిణీ చేశారు. జనసేన క్రియాశీలక నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణిల చేతులమీదుగా సభ్యత్వ నమోదు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కటికం నాగేంద్ర, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేశ్, మాదాసు నరసింహ, వర్దన్నగారి ప్రసాద్, ముత్యాల కిషోర్, కటికం వారిపల్లె జనసేనపార్టీ నాయకులు కటికం చంద్రయ్య, కటికం రామచంద్రయ్య, కటికం సుబ్రమణ్యం, జనసేనపార్టీ మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా

సిద్దవటం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చలమారెడ్డి, కొట్టాలు గ్రామంలో వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు పడిపోయి అంతరాయం స్తంభించడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. అందువల్ల ట్యాంకర్ ద్వారా తాగునీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతి సెక్రటరి విజయ్ గురువారం మాట్లాడుతూ చలమారెడ్డి, కొట్టాలు గ్రామంలో ఎస్సీ, బీసీ కాలని నివాసులకు గత ఐదురోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి 2 ట్యాంకర్ల ద్వారా గ్రామప్రజలకు తాగునీరు అందజేశామని,తాగునీటి ఎద్దడి లేకుండా సమస్య పరిష్కారం చేశామని పంచాయతి సెక్రటరి విజయ్ తెలిపారు.

కేజీబీవీ కళాశాల అదనపు గదులకు శంకుస్థాపన



పెనగలూరు కేజీబీవీలో జూనియర్ కాలేజి అదనపు గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరులోని కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కళాశాలలో 1.70 కోట్ల రూపాయలతో అదనపు గదుల నిర్మాణాన్ని గురువారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బాలికల విద్య కోసం పెద్దపీట వేస్తోందన్నారు. కేజీబీవీ జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణంతో పాటు అన్నిహంగులు, ప్రత్యేక వస్తువులతో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డీసీసీబీ మాజి డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, సింగారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మారంరెడ్డి లక్ష్మీనరసయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎం.శివయ్య, కట్టావారిపల్లె ఎంపీటీసీ శ్రీనివాసులునాయుడు, నాయకులు దాసరి దామోదర్‌నాయుడు, సుదర్శన్ చౌదరి, నరేంద్రబాబునాయుడు, జి.రంగారెడ్డి, కె.బాలక్రిష్ణ, కళాచంద్ర, పెనగలూరు, కట్టవారిపల్లె క్లస్టర్ ఇన్‌ఛార్జిలు సి.రవికుమార్, కె.నాగేశ్వరనాయుడు, కేజీబీవీ ఎస్‌వో సుచరిత, ఎంపీడీవో విజయరావు తదితరులు పాల్గొన్నారు.

54,095 లీటర్ల సారా ఊట ధ్వంసం

● 191 కేసుల నమోదు, 151 మంది అరెస్ట్

● 501 మంది బైండోవర్

- ఒకరిపై రెండు కేసులకు మించితే పీడీ యాక్ట్
- లక్కిరెడ్డిపల్లె, రాజంపేటలో సారా కేసులు నిల్
- జూలై 31 నాటికి సారా రహిత జిల్లాగా అన్నమయ్య
- నవోదయంలో 325 మందికి స్వయం ఉపాధి కోసం ప్రతిపాదనలు
- ఆంధ్రజ్యోతితో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్

పీలేరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటు సారా తయారు చేస్తున్న పలు అటవీ ప్రాంతాలలో మెరుపు దాడులు నిర్వహించి 54,095 లీటర్ల సారా ఊట ధ్వంసం చేశామని అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ తెలిపారు. గురువారం ఆయన పీలేరులో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి నవోదయం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ప్రారంభించామని చెప్పారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ వారిలో పరివర్తన తీసుకురావడం కోసం ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మెరుపు దాడులు నిర్వహించి ఫిబ్రవరి 19 నుంచి ఇప్పటి వరకూ పలు కేసులు నమోదు చేసి అనేక మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. జూలై 31వ తేదీ నాటికి సారా రహిత జిల్లాగా అన్నమయ్యను ప్రకటించడం కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో పోలీస్, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సిబ్బందితో ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉన్నతమైన లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

పరివర్తన కోసం..

నాటుసారా కాచడం, విక్రయించడమే జీవనాధారంగా ఉన్న వారిలో పరివర్తన తీసుకు రావడం కోసం నవోదయం కార్యక్రమంలో భాగంగా 30 శాతం సబ్సిడీతో బ్యాంక్ రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ జిల్లాలో 325 మంది జాబితాతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆవులు, కుట్టుమిషన్లు, కిరాణా షాపు తదితర స్వయం ఉపాధి కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. నవోదయం కార్యక్రమం ఫిబ్రవరి 19వ తేదీన ప్రారంభించి మొదటి 40 రోజులు నాటు సారా కాచడం, విక్రయించడం వల్ల పేదల జీవితాలు ఎలా దుర్భరమౌతున్నాయో వివరించామని తెలిపారు. సారాకు బానిసలు కావడంతో రోగాల బారిన పడి జీవితాలను చేజేతులారా నశనం చేసుకుంటున్నారని ప్రజలకు వివరించామని అన్నారు.

జిల్లాలో నాటుసారా ప్రభావిత గ్రామాలు

పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారా ప్రభావిత గ్రామాలు రామానాయక్ తండా, మర్రిమాకులపల్లె, అవులయ్యగారిపల్లె తండాలు, జిల్లేళ్ల మంద, బురుజుకాడపల్లె, వగళ్ల, ఎనుగొండపాళ్యం, దిగువతండాలు ఉన్నాయి. మదనపల్లె పరిధిలో నారమాకులతండ, కోటవారిపల్లె, తుమ్మలతండ. ములకలచెరువులో కోటకొండ, రామానాయక్ తండాలు ఉన్నాయి. వాల్మీకిపురం పరిధిలో దిగువ, ఎగువమేకలవారిపల్లె, షికారు పాళ్యం.. రాయచోటిలో శెట్టిపల్లె, పెద్దబిడికీ, పరికలబండ.. రైల్వేకోడూరు పరిధిలో వై.కోట, బోడుగుట్టపల్లెలను అత్యంత సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు.

కేసుల వివరాలు..

పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 66 కేసులు నమోదు చేసి 40 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే వారి వద్ద 157 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 15,270 లీటర్ల ఊట ధ్వంసం చేసి 315 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెలో 39 సారా కేసులలో 48 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద 592 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2,920 లీటర్ల ఊట ధ్వంసం చేసి రెండు వాహనాలను సీజ్ చేశారు. ములకలచెరువులో 37 కేసులు నమోదు చేసి 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 96 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 4075 లీటర్ల ఊట ధ్వంసం చేశారు. వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో 31 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 92 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 13,600 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి 100 కిలోల బల్లం స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరులో 12 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేసి 48 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 17,060 లీటర్ల ఊట ధ్వంసం చేసి 26 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. రాయచోటిలో 6 కేసులు నమోదు చేసి 10 మందిని అదుపులోకి తీసుకొని 86 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1170 లీటర్ల ఊట ధ్వంసం చేసి రెండు వాహనాలు సీజ్ చేశారు.





పీలేరు మండలం ఆవులయ్యగారిపల్లె వద్ద సారా ఊట ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటోలు)

రెండు కేసులుంటే పీడీ యాక్ట్..

నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఈ హెచ్చరించారు. ఒకే వ్యక్తిపై రెండు కేసులు నమోదైతే అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. అలాగే సారా తయారు చేసేవారికి నల్లబెల్లం సరఫరా చేసినా తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. నిందితులు ఎవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించేది ఉండదని హెచ్చరించారు.

రూ.1.57 లక్షల జరిమానా



జిల్లా వ్యాప్తంగా పలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకూ 501 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. వీరిలో మళ్లీ సారా విక్రయాలకు పాల్పడిన 18 మందిపై కేసు నమోదు చేసి రూ.1.57 లక్షల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ చెప్పారు. కాగా.. అన్నమయ్య జిల్లా పరిధిలో లక్కిరెడ్డిపల్లె, రాజంపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో సారా కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

నేడు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం

హాజరుకానున్న రాయలసీమ జిల్లాల ఉద్యాన శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరాజులు

రైల్వేకోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు ఉద్యాన విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు తెలిపారు. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో జరగబోవు కార్యక్రమాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో సాగులో ఉన్న వివిధ రకాల ఉద్యాన పంటలు, వాటి సాగు స్థితిగతులు, పరిష్కార మార్గాల దిశగా తీసుకోవాల్సిన చర్యలు, నూతన పరిశోధనలకు అవకాశం తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ పరిశోధన, విస్తరణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాల తర్వాత ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించనున్న ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశాలకు రాయలసీమ జిల్లాల నుంచి ఉద్యానశాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉద్యాన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల ప్రగతి నివేదికపై చర్చిస్తారన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ముఖ్యఅతిథిగా హజరౌతున్నట్లు ఆయన వివరించారు. రైతులు పండించిన పండ్ల రకాలను ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ కేటీ వెంకటరమణ, డాక్టర్ సి.మధుమతి, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల డీన్ పీటీ శ్రీనివాసులు, ఉద్యాన కళాశాలకు చెందిన సదరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

సుండుపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా తిరునాళ్ల, జాతరలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లింల మత పెద్దలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు తిరునాళ్ల, జాతరలు, పండుగలు ఉన్నాయని, ఎక్కడా కూడా వాటికి భంగం కలగకుండా నిర్వహించుకోవాలని కోరారు. చాందినీబండ్ల దగ్గర అసాంఘీక కార్యలాపాలు నిర్వహించేలా ప్రోత్సహించడం, మద్యం తాగి మత్తులో గలాటాలు సృష్టించడం వంటివి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపైన జాతర సమయంలో బండ్ల వద్ద రెచ్చగొట్టేలా మాట్లాడడం, విమర్శలు చేయడం వంటివి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి చాందినీబండి వద్ద ఇద్దరు పోలీసు సిబ్బంది ఉంటారని మసీదుల దగ్గర అల్లరి మూకలు అల్లర్లు చేయాలనుకుంటే తాట తీస్తామన్నారు. తిరునాళ్ల, జాతరలకు చాందినీబండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసులు, మత పెద్దలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరానికి పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారులు

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ శివారులోని వడ్డిపల్లె వద్ద కుక్కల దాడిలో జింక మృతి చెందింది. గురువారం వేకువజామున వడ్డిపల్లె సమీపంలోని మాదినకొండ అటవీ ప్రాంతం నుంచి ఓ జింక పిల్ల అడవి దాటి జనావాసాల్లోకి వచ్చింది. ఇది గమనించిన వీధి కుక్కలు జింకను తరమడంతో పాటు దాడి చేసి చంపేశాయి. విషయం తెలుసుకున్న ఎఫ్‌ఆర్‌ఓ జయప్రసాదరావు ఆదేశాలతో డీఆర్‌వో మదనమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని మదనపల్లె పశువుల ఆస్పత్రికి తరలించారు. అక్కడ పశువైద్యశాఖ ఏడీ రోహిణి ఆధ్వర్యంలో జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం జింక కళేబరాన్ని సమీప అడవిలో పూడ్చి పెట్టారు.

వివాదాస్పద నిర్మాణాలపై సబ్‌కలెక్టర్ విచారణ

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ రెవిన్యూ భవన్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న పునాదులపై సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ విచారణకు ఆదేశించారు. గురువారం కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన సబ్‌కలెక్టర్ ఆ స్థలం వెనక నిర్మిస్తున్న పునాదులపై ఆరా తీశారు. ఆ స్థలం ప్రభుత్వ స్థలమా, అందులో ఎవరికైనా లబ్ధిదారులకు కేటాయించారా అని తహసీల్దార్ ధనంజయులును ప్రశ్నించారు. దీనిపై పూర్తిగా విచారించి తనకు నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బీఎంపీ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో రామ్లానాయక్ కుమారుడు ఎం.కృష్ణానాయక్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా బీఎంపీపీ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 130 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

మదనపల్లె విద్యార్థినికి రాష్ట్ర స్థాయి బయోడైవర్శిటీ అవార్డు



డిప్యూటీ సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న గుణవిజయ

మదనపల్లెటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయో డైవర్శిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో మదనపల్లెకు చెందిన డిగ్రీ విద్యార్థిని గుణవిజయ ప్రథమ అవార్డు అందుకున్నారు. గురువారం విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. వారం రోజుల క్రితం ఎస్వీ యూనివర్శిటీ బయోడైవర్శిటీ గురించి నిర్వహించిన పోటీల్లో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థిని గుణవిజయ పాల్గొని వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ బయోడైవర్శిటీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.విజయకుమార్, ఐఎఫ్ఎస్ అధికారుల సమక్షంలో ప్రథమ బహుమతి అందుకున్నారు. డిప్యూటీ సీఎం చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్నారు. కాగా ఆ విద్యార్థినిని కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, బయోటెక్నాలజి హెచ్‌వోడీ డాక్టర్ రమ్య అభినందించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన అవసరం

ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా అధికారి వెంకటమోహన్



నవధాన్యాల సాగుపై రైతులకు వివరిస్తున్న వెంకటమోహన్

రాయచోటిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల (పీఎండీస్) సాగుపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ సాగు జిల్లా అధికారి వెంకటమోహన్ తెలిపారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు యూనిట్ లోని ఏపిలవంకపల్లిలో శంకరమ్మ పొలంలో నవధాన్యాల సాగు ఏ విధంగా చేపట్టాలి. ఎకరాకు ఎన్ని కిలోల విత్తనాలు వేయాలి, ఘనజీవామృతం ఎకరాకు ఎంత వేయాలి అనే అంశాలపైన రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాగు డివిజన్ ఇన్‌చార్జి రమణనాయక్, మండల ఇన్‌చార్జి వంశీ, యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల దొంగతనం కేసులో జైలుశిక్ష

ఓబులవారిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుల్లో నిందితులకు కోర్టు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీ కొర్లకుంట క్రాస్‌రోడ్డు వద్ద అయ్యవారెడ్డిపల్లె గ్రామానికి చెందిన లావనూరు దామోదర్ మోటారు సైకిల్‌ను సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం గ్రామానికి చెందిన పఠాన్‌సాహెబ్ దొంగలించాడు. విచారించి మోటారు సైకిల్‌ను రికవరీ చేసి నిందితుడిని రైల్వేకోడూరు కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ తేజసాయి 2 నెలల జైలుశిక్ష విధించారు. అలాగే మంగంపేట అగ్రహారంలో పసుపులేటి బాలాజి ఇంటి వద్ద ఉంచిన ఆటోను 2025 జనవరి 25వ తేదీ రాత్రి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన వడ్ల శివశంకరాచారి చోరీ చేశాడు. ఈ కేసులో కూడా మేజిస్ట్రేట్ నిందితుడికి ఒకటిన్నర నెల సాధారణ జైలుశిక్ష విధించారు.

టీడీపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం

● టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వైసీపీ భరతం పడతాం : చమర్తి ● జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలోనే పనిచేయండి : దుర్గాప్రసాద్







ఎడ్లబండిపై ర్యాలీగా వస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, దుర్గాప్రసాద్, జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దుర్గాప్రసాద్‌లు పిలుపునిచ్చారు. గురువారం రాజంపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలు అనవసరంగా టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు కడపలో జరిగే మహానాడు కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ సత్తా చాటుదామని చెప్పారు. పార్టీ నియోజకవర్గ కార్యకర్తలకు ఎళ్లవేళలా తాను అందుబాటులో ఉంటానని చమర్తి వెల్లడించారు. అందరూ వ్యక్తిగత విభేదాలు మాని నియోజకవర్గంలో టీడీపీ పూర్వ వైభవానికి, పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాజంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి వచ్చే స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేటలో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

పార్టీ పరిశీలకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎవరూ వ్యక్తిగత అజెండాలకు పోకుండా కార్యకర్తలకు ఏ పని కావాలన్నా, పార్టీ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు నాయకత్వంలోనే చేసుకోవాలన్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మాజీ మండలాధ్యక్షులు పారా సుబ్బానాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యానాయుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, జిల్లా తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు శరత్‌కుమార్‌రాజు తదితర మండల నాయకులు, సీనియర్ టీడీపీ నాయకులు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గం నుంచి 30 వేల మంది కార్యకర్తలను తీసుకెళ్లదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎద్దుల బండ్లపై నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు భారీ ఎత్తున భోజనం ఏర్పాటు చేశారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

● రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రిన్స్ టెస్ట్-2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకు ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి.మోక్షిత్ 400 మార్కులకు గాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడన్నారు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వినిహర్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. వీరితో పాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.

దేశ సమైక్యత కోసం పాటుపడాలి

లక్కిరెడ్డిపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత కోసం అందరూ పాటుపడాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా గురువారం లక్కిరెడ్డిపల్లెలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడురోడ్ల కూడలి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్‌కు సంతాపం తెలిపి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదన్‌మోహన్, షేక్ ఆరీఫ్, రెడ్డెయ్య, డాక్టర్ షఫీనాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో చక్రేనాయక్, ఎంపీడీవో ఉషారాణి, పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా



వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

- నిరుపయోగంగా మారిన రైతుబజార్
- ఏడాది పూర్తయినా ఉపయోగంలోకి రాని వైనం

వేంపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులను స్వయంగా అమ్ముకొని లాభపడాలన్న ఉద్దేశ్యంతో రైతు బజార్ నిర్మించారు. ఏడాది క్రితం నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు. అయితే పలు రకాల కారణాలతో ఇప్పటి వరకు రైతు బజార్ ఉపయోగంలోకి రాకపోవడంతో రూ.1.20 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది.

వేంపల్లెలోని ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన రైతు బజార్‌ను నిర్మించారు. రూ.1.20 కోట్లతో నిర్మించి.. గతేడాది మే నెలలో ప్రారంభించారు. అందులో 8



రైతు బజార్‌లో ఉన్న స్టాల్స్

షాపింగ్ గదులు 44 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రైతులు తక్కువ అద్దెతో స్టాల్స్ దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తెలిపారు. అయితే పంచాయతీ పరిధిలో కడప రోడ్డులో ప్రైవేటు కూరగాయల మార్కెట్ నడుస్తోంది. ఈ కారణంగా రైతుబజార్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు, రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. వ్యవసాయశాఖ అధికారులు ఎన్నిమార్లు రైతులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి చెప్పిన రైతు బజార్‌లోకి వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. ప్రైవేటు కూరగాయల మార్కెట్ మూసేస్తే ఇక్కడకు వస్తారని చెప్పినా, వేలంలో ప్రైవేటు కూరగాయల మార్కెట్ షరతు ఉందని, ఏడాది వరకు మార్చలేమని చెప్పడంతో రైతు బజార్ నిరుపయోగంగా ఉంది. రైతు బజార్‌ను తెరిచి ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీకి... నెల అద్దెకు

రైతులు స్వయంగా రైతు బజార్‌లోకి రాలేదన్న కారణంతో వ్యవసాయశాఖ మార్కెటింగ్‌శాఖ అధికారులు పంచాయతీకి అప్పగించాలని నిర్ణయించారు. నెల అద్దె రూ.1.20 లక్షలు చెల్లించాలని, పంచాయతీ ఆధ్వర్యంలోనే రైతు బజార్‌ను నడుపు కోవాలని... ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై కలెక్టర్ డీపీఓతో చర్చించి నెల అద్దె రూ.80వేలు చెల్లించాలని కడప పంచాయతీ అధికారిణికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు కూడా ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు. వేంపల్లెలో ప్రస్తుతం ఈఓ లేని కారణంగా మార్కెట్ వేలం గడువు ముగిసినా కొత్త టెండర్ పిలువలేదు. కొత్త ఈఓ రామసుబ్బారెడ్డి జాయిన్ అయి వారం రోజులకే లీవ్‌పెట్టి వెళ్లడంతో మార్కెట్ టెండర్ వేలంకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో రైతు బజార్ సమస్యను పరిష్కరించే ఆస్కారం లేకుండా పోయింది. ఇటు రైతు బజార్ తెరవాలంటే కొత్త వేలం టెండర్‌లో అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పంచాయతీ ఈఓ వచ్చిన తర్వాత రైతు బజార్ భవితవ్యం తేలే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

రైతు బజార్‌ను తెరిచి రైతులకు ఉపయోగపడేలా సహకరించాలని స్థానిక పంచాయతీ అధికారులను కోరుతూనే ఉన్నాం. ఇప్పటికి పలుమార్లు లేఖ రాశాం. నెల అద్దె రూ.80వేలను నిర్ణయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ జీఓను పంచాయతీ అధికారులకు అందించాం. స్థానిక పంచాయతీ పాలకమండలి ఈఓ చర్చించి రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని కోరుతున్నాం.

-రుచిత, రైతు బజార్ అధికారిణి, వేంపల్లె

కేసీ తూములు ఇలా...




జిల్లేళ్ల వద్ద రాళ్లు విరిగిపడి పాడైన తూము

- పాడైన షట్టర్లు... గేర్‌బాక్స్‌లు
- ఆందోళనలో రైతులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

దువ్వూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతన్నలకు జీవనాధరం కేసీ కాలువ. కేసీ కెనాల్ కింద జిల్లా పరిధిలో 82,937 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతియేటా సకాలంలో వర్షాలు పడితే కేసీ కెనాల్‌కు నీటి సరఫరా జరిగి పంటలు సస్యశ్యామలంగా పండుతాయి. శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా ప్రతి యేటా కేసీ కాలువకు నీరు అందుతుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో పొలాలను తడిపే కేసీ తూముల షెట్టర్లు పాడైపోయాయి. కేసీ కాలువకు నీటి ప్రవాహం ఉన్న సమయంలో పాడైన షట్టర్లు, గేర్‌బాక్స్‌లు మొరయిస్తున్న కారణంగా నీరు వృథా అవుతోంది. వీటి మరమ్మతులపై నీటిపారుదల శాఖ దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మైదుకూరు నియోజకవర్గం పరిధిలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట మండలాల పరిధిలో కేసీ కాలువ కింద 55,872 ఎకరాల ఆయకట్టు ఉంది. వరి, పసుపు, వేరుశనగ, జొన్న తదితర పంటల సాగుపై రైతులు ఆసక్తి కనపరుస్తారు. ఈ నేపథ్యంలో కాలువ పరిధిలో తూముల నిర్వహణ సరిగా లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవతున్నారు. దువ్వూరు మండల పరిధిలో మొత్తం 15 తూములు ఉన్నాయి. వాటికున్న షట్టర్లు, సామాగ్రి రాంసాయినగర్, జిల్లేళ్ల, ఏకోపల్లి, భీమునిపాడు, అన్నపుశాస్త్రులపల్లి పరిధిలో పాడైనట్లు రైతులు వాపోతున్నారు. వీటితోపాటు తూముల్లోని గేరుబాక్సులు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ప్రతియేటా సకాలంలో వర్షాలు పడితే ఆగస్టులో నీటి సరఫరా జరుగుతోంది. వీటి మరమ్మతుల పనులు చేపడితే నీటి వృథాకు ఆస్కారం లేకుండా రైతులు సద్వినియోగం చేసుకుంటారు.

జిల్లాలో మైదుకూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు రాజుపాళెం, ప్రొద్దుటూరు, చెన్నూరు, వల్లూరు, చింతకొమ్మదిన్నె, కడప మండలాల పరిధిలోని కేసీ తూముల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని ఆయా ప్రాంతాల రైతాంగం కోరుతోంది. ఏడాది కిందట రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇరిగేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.350 కోట్లు కేటాయించినట్లు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. ఈ నిధులు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తే తాగు, సాగునీటికి తాత్కాలిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చునని భావిస్తున్నారు. ఏది ఏమైనా తూముల బాగోగులపై శ్రద్ధ వహిస్తే రైతుల పొలాలకు నీరు అంది పంటలు పండే అవకాశం ఉంది. ఈ విషయంపై దువ్వూరు సెక్షన్ కేసీ కాలువ ఏఈ పవన్‌కుమార్ వివరణ ఇస్తూ... తూముల మరమ్మతులపై దృష్టి సారించినట్లు తెలిపారు. దెబ్బతిన్న వాటి పనుల కోసం ఇంతకుమునుపే టెండర్లు జరిగాయని, వాటి పనులు త్వరలో చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.





షట్టర్‌లేని రాంసాయినగర్‌వైపు పొలాల తూము, తుప్పుపట్టిన ఏకోపల్లె తూము షట్టర్

ఘనంగా ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

చక్రాయపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. గురువారం ఉదయం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, హోమగుండ ప్రోక్షణ అనంతరం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు ధర్మగిరి వేద పాఠశాల అధ్యాపకులు శ్రీమన్ రామానుజార్యులు బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో గండిక్షేత్రం కిటకిటలాడింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3వరకు క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 5వేల మంది భక్తులకు ఎర్రగుంట్లకు చెందిన ఓబుల్‌రెడ్డి, రమాదేవి దంపతలు, అప్పకుందు వెంకట సుబ్బారెడ్డి, సునీత దంపతులు అన్నదానం చేశారు. కాగా, స్వామివారి నిత్యా న్నదాన పథకానికి గండి క్షేత్రానికి చెందిన ఎద్దుల రాజశేఖర్, పార్వతి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. బద్వేలుకు చెందిన పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, ఆదిలక్ష్మి రూ.51వేలు, వేంపల్లెకు చెందిన గురుమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య మునెమ్మ రూ.25,116 విరాళంగా ఇచ్చారు. కాగా, ఉత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన మహిళలు కోలాటాలు ఆకట్టుకున్నాయి. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, అర్చకులు గోపాలస్వామి, రామమోహన్‌శర్మ, దేవస్థాన చైర్మన్ కృష్ణ తేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



మహాపూర్ణాహుతిలో భాగంగా అగ్నికి ఆహుతి ఇస్తున్న ద్రవ్యాలు

వెల్లాలో వైభవంగా....

రాజుపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సంజీవరాయస్వామికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ఆకుపూజలు, వడమాల తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఒంటె వాహనంపై సంజీవరాయస్వామి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒంటెవాహనంలో ఊరేగుతున్న సంజీవరాయస్వామి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన కుమార్

చాపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లె కుమార్ (38) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొత్తరాజువారిపేట గ్రామానికి చెందిన కుమార్ ప్రొద్దుటూరు నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అతని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మినీ లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన రాజేశ్, రాహుల్

చెన్నూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూరుకు చెందిన రాజేశ్ (17), రాహుల్ (17) ద్విచక్ర వాహనంపై కడపకు వెళుతుండగా వారి ముందు వెళుతున్న మినీ లారీ ఎదురుగా గేదె అడ్డం రావడంతో బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పి వెనక వైపు మినీ లారీని ఢీకొ న్నారు. ఈ సంఘటనలో రాహుల్ తలకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. రాజేశ్ కూడా గాయపడ్డాడు. ఇరువురిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం... కేసు

వేముల, మే 22 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలికపై 17ఏళ్ల బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలో ఓ బాలిక (మూగ,చెవిటి) ఇంట్లో ఉండగా ఓ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి గమనించి గట్టిగా అరవడంతో నిందితుడు అక్కడ నుంచి పారిపోయాడు. తర్వాత జరిగిన విషయాన్ని ఆమె భర్తకు ఫోన్ ద్వారా తెలియజేయగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు వితరణ





వెండి ఆభరణాలను సమర్పిస్తున్న టీడీపీ నాయకులు, అలంకరించిన వెండి ఆభరణాలతో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం ఆంజనేయస్వామికి రెండు కిలోల వెండి కవచం, పాదాలు, కిరీటం వితరణగా ఇచ్చారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎన్నికల్లో గెలిస్తే ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలు చేయిస్తానని ఆయన మొక్కుకున్నారు. తన కోర్కె నెరవేరడంతో హనుమాన్ జయంతి సందర్భంగా వెండి ఆభరణాలను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య చేతుల మీదుగా ఆలయపూజారికి అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి ఆంజనేయస్వామికి నూతన ఆభరణాలను అలంకరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, కేసీకెనాల్ వైస్‌చైర్మన్ లక్కిపేట గురివిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటికో పారిశ్రామికవేత్త.. ప్రభుత్వ లక్ష్యం



ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సీకేదిన్నె, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నెలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహించే ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశారన్నారు. అదే స్ఫూర్తితో మహిళలు ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రతి ఇంటి నుంచా పారిశ్రామికవేత్త తయారు కావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో కమలాపురంతో పాటు చింతకొమ్మదిన్నెలో ఉచిత కుట్టుమిషన్ల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, వీరూప్రసాద్, రాజారావు, నజీర్, శంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, గోవిందు, వెంకటసుబ్బయ్య అధికారులు పాల్గొన్నారు.

పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో డీఎఫ్‌వో వినీత్‌కుమార్, అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కడప ఫారెస్టురేంజ్ పరిధిలోని మద్దిమడుగు ఈస్ట్ బీట్‌లో పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా అటవీ అధికారి వినీత్‌కు మార్ తెలిపారు. కడప అటవీ క్షేత్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం తెల్లవారుజామున 3గంటల గంటల సమయంలో కొంత మంది వ్యక్తులు అడవిలోకి వెళ్లినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో కడప రేంజ్ కార్యాలయ పరిధిలోని సిబ్బంది మద్దిమడుగు ఈస్ట్‌బీట్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టగా 6.30 గంటలకు చల్లపల్లి బావి వద్ద పది మంది తమిళ కూలీలు కనిపించారన్నారు. అటవీ సిబ్బం దిని చూసి దుంగలను అక్కడే వదిలేసి పారిపోతుండగా తమిళనాడు ధర్మపురి జిల్లాకు చెందిన రమణ ఆడియన్ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. మిగిలిన 9 మంది పారిపోయారని.. వారి కోసం గాలింపు చేపట్టామన్నారు. కూలీలు వదిలి వెళ్లిన దుంగలను స్వాధీనం చేసుకున్నామని.. వాటి బరువు 490 కేజీలు ఉంటుందన్నారు. ఈ వ్యవహారంలో స్థానికుల ప్రమేయం ఏదైనా ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సమా వేశంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసరు ప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు మట్కా బీటర్లు అరెస్టు



మట్కా బీటర్లను చూపుతున్న ఎస్‌ఐ హనుమంతు

ప్రొద్దుటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం సాయికుటీర్ రోడ్డులోని విహంగ అపార్ట్‌మెంట్ ఎదురుగా మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను గురువారం మధ్యాహ్నం త్రీటౌన్ ఎస్‌ఐ హనుమంతు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.95 వేల నగదుతో పాటు మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన జి.విశ్వనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన జె.నరసింహులు, ప్రొద్దుటూరు టౌన్ దేవాంగపేటకు చెందిన జి.వీరయ్యలు వున్నారు.

సిద్ధేశ్వరం అలుగుతోనే రాయలసీమ సస్యశ్యామలం

ప్రొద్దుటూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగుతోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ ఎస్‌పీ మహమూద్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31న సంగమేశ్వరం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం వలన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 50 టీఎంసీల నీరు నిలువ చేసుకునే అవకాశం ఉందని, ఆ నీటితో సీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. విరసం సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ అసమానతల వలనే తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిందని, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి సిద్ధేశ్వరం అలుగు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనెల 31న నిర్వహించే భారీ బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, రాయలసీమ విద్యార్థి సంఘం కన్వీనర్ హరిత, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి

● అంబరాన్నంటిన ఊరేగింపు సంబరాలు
● అంజనీ తనయుడి నామస్మరణలో భక్తులు



నిమ్మనపల్లె : మాచిరెడ్డిగారిపల్లిలో 25 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహానికి పూజలు, ములకలచెరువు : పూజలు చేస్తున్న ఏడుమడకలపల్లె గ్రామస్థులు, , మదనపల్లె : మామిడి పండ్ల అలంకరణలో మదనపల్లెలోని వరాల ఆంజనేయస్వామి, వాల్మీకిపురం : విశేష పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి

పీలేరురూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా పీలేరులో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. గురువారం తెల్లవారు జాము నుంచి పట్టణంలోని యర్రంరెడ్డిగుట్టలో వెలసిన అభయహస్త అంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, వడపూజ, ఆకు పూజ, హోమం, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినీ బండిలో స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త ఏటీ. రత్నశేఖర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఆశోక్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే సదుం మార్గంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 23న పట్టణంలో స్వామి వారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, దినకర, తులసిక్రిష్ణ, సుదర్శన్, ప్రధాన అర్చకులు రాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: మదనపల్లె పట్టణం, మండలంలో పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అర్చనలు, పూజలు నిర్వహించారు. స్వామివారికి మామిడి పండ్లతో విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. రాత్రికి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరి సర్కిల్‌లోని అభయాంజనేయ స్వామికి పూజలు చేశారు. ఇందులో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం పుష్పపల్లకిలో ఊరేగించారు. పుంగనూరు రోడ్డులోని బసినికొండ సమీపంలో ప్రసన్న ఆంజనేయస్వామివార్లకు, చీకలగట్టులో అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు చేశారు.

నిమ్మనపల్లి: పెద్దమాదిగిపల్లి, దిగువపల్లి గ్రామాల్లో హనుమాన్ జయంతి వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు దర్శించుకొన్నారు. మాచిరెడ్డిగారిపల్లిలో వెలసిన 25 అడుగుల పంచముఖి హనుమాన్ విగ్రహం వద్ద 24 గంటల పాటు రామకోటి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయాలకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కురబలకోట: మండలంలోని చేనేతనగర్, ముదివేడు, గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో వేడుకలను పండితులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ములకలచెరువు: మండలంలోని సోంపల్లె పంచాయతీ ఏడుమడకలపల్లె సమీపంలోని పాపాఘ్ని నదీ తీరంలో వెలసిన ఏటిగడ్డ వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం మహాగణపతి పూజ, పంచామృతతాభిషేకం తదితర కార్యక్రమాలతో పాటు పండరీ భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ములకలచెరువు, పెద్దపాళ్యం, సోంపాళ్యం, కదిరి నాథునికోట క్రాస్ తదితర గ్రామాల్లో జయంతి ఉత్సవాలు జరిగాయి.

గుర్రంకొండ: గుర్రంకొండ కోట, అమిలేపల్లె, సూరప్పగారిపల్లె, సంగసముద్రం, తరిగొండలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయాన్నే అర్చన, అభిషేకాలు, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారికి భక్తులు ఆకు పూజ, భజనలు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కలకడ: మండలంలోని బాటవారిపల్లె పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకొని మామిడితోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకు పూజ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వాల్మీకిపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దగల వీరాంజనేయస్వామి ఆలయం, బైపాస్ రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం, పడమర పొలిమేరలోని ధర్మపథం ఆలయాల్లో పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో అర్చకులు శీనాస్వామి, అనిల్, యువత, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యంలో కుషావతినది తీరంలో, పెద్దమండ్యం చెరువు కట్టల మధ్య వున్న అభయ అంజనేయ స్వామి ఆలయాల్లో పాటు పాపేపల్లి, కలిచెర్ల, కొలిమికాడపల్లి, ముసలికుంట, మందలవారిపల్లి, వెలిగల్లు, సి.గొల్లపల్లి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రంలో: స్థానిక పీటీఎంలోని శివాలయంలో సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహానికి అభిషేకం, తమలపాకుల పూజ, వడమాల పూజలను ప్రత్యేకంగా నిర్వహించారు. భక్తులకు లండన్‌లో ఉంటున్న కొత్త సారిక, కొత్త వినోద్‌కుమార్ దంపతులు అన్నదానం వితరణగా చేశారు.

అదేవిధంగా పులికల్లు గ్రామంలో వెలసిన ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో హనమజ్జయంతిని పురష్కరించుకుని గ్రామస్తులు అఖండ రామకోటి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పండగ వాతావరణంలో మినీ మహానాడును జరుపుకుందాం

● తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 22(ఆంధ్రజ్యోతి): పండగ వాతావరణంలో మినీ మహానాడును జరుపుకుందామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములకలచెరువులో ఈ నెల 24న మినీ మహానాడు జరుగుతుందని, అందరూ కలిసికట్టుగా మినీ మహానాడు కార్యక్రమానికి తరలిరావాలన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. మినీ మహానాడుకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. అదేవిధంగా నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ఫోన్లు చేసి ఆహ్వానించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు మాట్లాడారు. సమావేశంలో తంబళ్లపల్లె మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ ఎంపీపీ నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నేతలు సురేంద్రనాయుడు, ఆంజనేయరెడ్డి, తులసీధర్‌నాయుడు, విశ్వనాధరెడ్డి, శివ, ఓబులేసు, డేరంగుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా..చల్లగా చూడమ్మా..



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తంబళ్లపల్లె, మే 22(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని సంతోపులో వెలసిన కోటకొండ గంగమ్మ పగలు తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. కోటకొండ గంగమ్మా... చల్లగా చూడమ్మా అంటూ భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కాయ, కర్పూరాలు సమర్పించి హారతులతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని వేడుకున్నారు. బుధవారం రాత్రి పలు గ్రామాల ప్రజలు చాందిని బండ్లు కట్టి సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తంబళ్లపల్లె పరిసర గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా జనసంద్రంగా మారింది. సాయంత్రం అమ్మవారిని పల్లకిలో ఆలయం చుట్టూ తిప్పి భక్తులకు అమ్మవారి దీవెన బండారును అందజేశారు.

గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలి

● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్

పీలేరురూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో మగ్గుతున్న గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి ఆదుకోవాలని పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి టీ.ఎల్. వెంకటేష్ కోరారు. గురువారం కేవీపల్లె మండలం కలికిరివాండ్లపల్లెలో గిరిజనులతో ఇక్కట్లుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం పలు పథకాలు ప్రవేశపెట్టినా అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలని, పూరి గుడిసెల్లో దుర్భర జీవితాలు గడుపుతున్న వారికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 31వ తేది జరిగే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంగయ్య, దొర, సుమిత్ర, సౌజన్య, రమణయ్య పాల్గొన్నారు.

అర్జీలపై గ్రామాల్లో విచారణ



పెన్షన్‌దారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

పెద్దతిప్పసముద్రం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్లపల్లె, పోతుపేట గ్రామాలకు చెందిన పలువురు మహిళలు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో తమకు వితంతు పెన్షన్‌లు రాలేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ తక్షణం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించడంతో గురువారం ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్‌తో పాటు ఆయా పంచాయతీ కార్యదర్శులు విష్ణు, శివప్రసాద్‌లు గ్రామాల్లోకి వెళ్లి ఫిర్యాదుదారులను కలిసి విచారణ చేపట్టారు.

బోరు, మోటార్ల వైర్లు చోరీ



కేబుల్ వైర్లను చూపుతున్న రైతులు

గుర్రంకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): రైతుల బోరు, మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన టి.రాచపల్లెలో జరిగింది. రైతుల వివరాల మేరకు.. మండలంలోని టి.రాచపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి, సిద్దమల్లురెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రమేష్‌బాబుతో పాటు మరికొందరికి చెందిన బోర్ల కేబుల్ వైర్లను బుధవారం రాత్రి దుండగులు దోచుకెళ్లారు. పది మందికి చెందిన రైతుల బోరు మోటర్ల కేబుల్ వైర్లను చోరీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. దుండగులు కత్తిరించి తీసుకెళ్లిన కేబుల్ వైర్ల విలువ రూ.60 వేలు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కేబుల్ వైర్ల చోరీ దొంగలను పట్టుకోవాలని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా హైదర్‌వలి



నియామక పత్రం అందుకుంటున్న హైదర్‌వలి

ములకలచెరువు, మే 22(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ములకలచెరువుకు చెందిన కె.హైదర్‌వలి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డీసీసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్‌అలీ, ఏపీసీసీ డెలిగేట్ ఎస్ఎండీ గౌస్‌లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. తనకు మైనార్టీ అధ్యక్షుడిగా నియమించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు.. దేశానికి దిక్సూచి : ఎమ్మెల్యే



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబునాయుడు రాబోయే రోజుల్లో దేశానికే దిక్సూచిలా నిలుస్తారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన మినీమహానాడుకు నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తొలుత హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయుడి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే జెండాకు వందనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత సీఎం ఎన్టీ రామారావు టీడీపీ స్థాపించిన అనతి కాలంలోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, బీసీ, బడుగు, బలహీనుల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నేడు చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని పాలన అందిస్తున్నారన్నారు. కడపలో నిర్వహించే మహానాడుకు మదనపల్లె నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులను తరలిస్తామన్నారు. మినీమహానాడులో మదనపల్లె అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానించారు. మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు చంద్రబాబుకు సముఖంగా వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, సమన్వయకర్త మార్పురి సుధాకర్‌నాయుడు, ఆర్‌జే వెంకటేశ్, ఆర్‌కే రామకృష్ణాచారి, కౌన్సిలర్లు నాగార్జునబాబు, తులసి, మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్, ఎస్‌ఏ మస్తాన్, శేషాచలపతినాయుడు, పఠాన్‌ఖాదర్‌ఖాన్, చీకిలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్, ఎస్ఎం రఫి, షంషీర్, శివన్న, చిన్నమహేష్, రఘుపతినాయుడు, కత్తిలక్ష్మన్న, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పనుల వేగం పెంచాలి : డ్వామా పీడీ



ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

మదనపల్లెటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో ఉపాధి హామీ పథకం కింద తవ్వుతున్న ఫారం పాండ్ల పనుల్లో వేగం పెంచాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. గురువారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్దేశిత ప్రమాణాలతో పనులు చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే ఉద్యానపంటల సాగులో ఉపాధి పనులు గురించి రైతులకు, కూలీలకు వివరించారు. ఉపాధి పనుల్లో లక్ష్యాలను చేరుకునేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఏపీవో చెన్నకేశవ, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ నుంచి తొలగింపు

మదనపల్లెఅర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో ఇటీవల జరిగిన ఆర్థిక అక్రమాల విచారణ అనంతరం నాగరాజు, ఓబులేసు, పృథ్వీరాజ్‌లను యూనియన్ నుంచి తొలగించినట్లు ఆ యూనియన్ గౌరవాధ్యక్షుడు సాంబశివ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఆర్థిక అక్రమాలు, అరాచకాలకు పాల్పడిన వారిని రాష్ట్ర నాయకుడు, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ రామచంద్రయ్య సూచనల మేరకు తొలగించామని తెలిపారు. యూనియన్ హక్కుల పరిరక్షణ, నైతిక విలువల పరిరక్షణకు చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరించారని ఈ చర్య తీసుకొన్నట్లు ఆయన తెలిపారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం

ములకలచెరువు, మే 22(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీపై అవగాహన అవసరమని ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపీపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యనిపుణులు, డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల ప్రజాపరిషత్ సిబ్బంది, జీఎస్‌డబ్ల్యుఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మహానాడును విజయవంతం చేయండి'

గుర్రంకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతి ఏటా నిర్వహిస్తున్న మహానాడును విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ మైనారిటీ ప్రధాన కార్యదర్శి షేక్.నౌషాద్‌అలీ పేర్కొన్నారు. గురువారం గుర్రంకొండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర ఉన్నతి కోసం ప్రతి ఏటా మహానాడును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు మండలం నుంచి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఎన్టీఆర్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

'అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ'

వాల్మీకిపురం, మే 22(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారిని నియంత్రించవచ్చని చింతపర్తి వైద్యాధికారిణి సాయిశ్రీ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో ఎయిడ్స్, హెచ్ఐవీ పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సదస్సులో కేసీ నటరాజన్ బృందంచే జానపద గీతాలు, నాటికలు, బుర్రకథ ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఆశావర్కర్లు కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకుందాం

● జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్

వాల్మీకిపురం, మే 22(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ కొనసాగేందుకు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ జీవ వైవిధ్య ప్రాముఖ్యతను తెలియజేశారు. మనిషి తన జీవన శైలిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకోవడం ద్వారా భవిష్యత్తు తరాల మనుగడకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

1 నుంచి షాపుల ద్వారానే రేషన్ పంపిణీ

తంబళ్లపల్లె, మే 22(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల్లోనే పంపిణీ చేయాలని తహసీల్దారు హరికుమార్ రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సివిల్ సప్లయ్స్ డీటీ భవనేశ్వరీతో కలసి మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. డీలర్లు రేషన్ సరుకులను సకాలంలో, సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేది వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి సరుకులను పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ

పెద్దమండ్యం, మే 22(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ చౌక దుకాణాల్లో జూన్ 1వ తేదిన పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ 1వ తేది నుంచి డీలర్లు రేషన్‌కార్డుదారులకు సకాలంలో బియ్యం పంపిణీ జరగాలన్నారు. కీ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలన్నారు. వృద్ధ దంపతులకు ఇళ్ల వద్దే రేషన్ బియ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, సర్వేయర్ హసీన్‌తాజ్, మండల డీలర్లు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన మండల నాయకులు



మినీ మహానాడుకు వెళ్తున్న నాయకులు

రామసముద్రం, మే 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో గురువారం నిర్వహించిన మినీ మహానాడుకు రామసముద్రం మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు వెళ్లారు. మండలంలోని 19 పంచాయతీల నుంచి ఆయా పంచాయతీల నాయకులు సుమారు 20 సుమోలు, ద్విచక్రవాహనాల్లో మదనపల్లె చేరుకున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఎన్టీఆర్ అమర్ రహే, జై చంద్రబాబునాయుడు, లోకేష్, షాజహాన్‌బాషా అంటూ నినాదాలు చేశారు. మదనపల్లెకు వెళ్లిన వారిలో మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు రెడ్డిశేఖర్, శివన్న, తిప్పన్న, కమ్మవారిపల్లె సర్పంచ్ ఇంజం వెంకటరమణనాయుడు, రూపేష్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శంకర్‌నాయుడు, లోకనాథ్‌రాజు, వెంకటేష్, వికాస్‌స్వామి, అధిక సంఖ్యలలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి

తంబళ్లపల్లె, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో, నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి కార్యదర్శులకు సూచించారు. గురువారం ఆయన తంబళ్లపల్లె పంచాయతీలో ముమ్మరంగా పర్యటించారు. తొలుత తంబళ్లపల్లెలో డంపింగ్‌యార్డును, ఉపాధిలో నిర్మించిన పశువుల నీటితొట్టెను పరిశీలించారు. యార్డులో మొక్కల పెంపకం, నిర్వహణ, తడి, పొడి చెత్త విభజనపై కార్యదర్శి రామకృష్ణను ప్రశంసించారు. అనంతరం తంబళ్లపల్లెలో మురికి నీటి కాలువలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికుల ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త బండి ఎన్ని రోజులకు వస్తోందని అడిగి తెలుసుకున్నారు. చెత్తను వీధుల్లో పడవేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, జనసేన నాయకుడు ఎద్దుల నరసింహులు, పంచాయతీ సిబ్బంది భాస్కర, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

మదనపల్లెఅర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణం నీరుగట్టువారిపల్లెలోని టిప్పు సుల్తాన్ మైదానంలో గురువారం నుంచి జూన్ 8వ తేది వరకు మహాభారతం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ పేర్కొంది. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి మహాభారతం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బీజేపీ వెంకటేష్ మాట్లాడుతూ గురువారం నుంచి ప్రతి రోజు పగలు హరికథ, రాత్రి మహాభారత నాటకాలు జరుగుతాయని తెలిపారు. వింటే మహాభారతం వినాలి.. తింటే చిట్టుగారే తినాలన్నట్లు వేంకటేశ్వర నాట్య కళామండలి వారిచే 18 రోజులు నాటకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బీజేపీ వెంకటేష్, డాక్టర్ రామచంద్ర నాయుడు, రాజారత్నం, సుబ్బహ్మణ్యం భోజనపు, జేసీబీ మధు, రామారావు కాలనీ సురం సహదేవ, అశ్వర్థం, తదితరులు పాల్గొన్నారు.



మహాభారతంలో హరికథ వినిపిస్తున్న దృశ్యం